క్లుప్తంగా

నేడు తుని రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు ప్రారంభం

తుని: అమృత్ భారత్ పథకానికి ఎంపికైన తుని రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని రైల్వేశాఖ అధికార ప్రతినిధి ఆర్.నవీన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు అవసరమైన వసతుల కల్పనకు అమృత్ భారత్ పథకంలో రూ.20 కోట్ల వరకు నిధులు వస్తాయన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణిలను పనుల ప్రారంభోత్సవానికి ఆహ్వానించినట్టు తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలో 11 రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ పథకానికి ఎంపికయ్యాయని, ఆయా స్టేషన్లలో వర్చువల్‌గా పనులను ప్రారంభిస్తారని వివరించారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై సత్యదేవుడు, అమ్మవారిని తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, యనమండ్ర శర్మ చిట్టి శివ, ఉపాధ్యాయుల రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు



ఏలేశ్వరంలో పారాయణం చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని దుర్గాదేవి ఆలయంలో శనివారం పలు పారాయణలు పఠించారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో విష్ణుసహస్ర, శివ స్తోత్రాలు, లలితాసహస్రనామ పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, ఉడతల రమణారావు, సంఘ మహిళా సభ్యులు దేవి, కామాక్షి, లక్ష్మీకుమారి, మల్లేశ్వరి, ఇందిరా, పద్మజ పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగు నీరు



యర్రంపాలెం పంపు హౌస్ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు

గండేపల్లి: ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా అన్నారు. మండలంలోని యర్రంపాలెం వద్ద గల పెద్దాపురం లిఫ్ట్–2 పంపు హౌస్ నుంచి ఆయకట్టుకు శనివారం నీటిని విడుదల చేశారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ ముఖ్య అతిథులుగా పాల్గొని స్విచ్చాన్ చేసి సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతు ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ లిఫ్ట్ ద్వారా గండేపల్లి, పెద్దాపురం, జగ్గంపేట, రంగంపేట మండలాల్లోని 17,700 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుందని తెలిపారు. డీఈ శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... స్థానిక నరేంద్రగిరి వద్ద ఎన్‌హెచ్‌ను ప్రత్తిపాడుకు చెందిన దూలి లోవయ్య బైక్‌పై దాటుతుండగా విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లోవయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

గ్రామాల్లో మహిళా శక్తి ప్రచార రథయాత్ర

కిర్లంపూడి: మండలంలోని రామకృష్ణాపురంలో టీడీపీ మహిళా శక్తి ప్రచార రథయాత్రను శనివారం ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు శరకణం సూర్యకుమారి ప్రారంభించారు. సర్పంచ్ కంతం సరస్వతి ఆధ్వర్యంలో మహిళలు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను వివరించారు.

ప్రత్తిపాడు: మండలంలోని టి.రాయవరంలో శనివారం సాయంత్రం భవిష్యత్‌కు గ్యారంటీ పేరిట టీడీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ టీడీపీ మ్యానిఫెస్టోలోని మహాశక్తి పథకాల కరపత్రాలను ప్రజలకు పంచారు.

సురక్షకు నీరాజనం

- జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం
- ప్రతిఇంటిని జల్లెడపట్టిన అధికారులు
- ఇంటి వద్దే సర్టిఫికెట్లు అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



కోటనందూరు జగనన్న సురక్షలో లబ్ధిదారుకి సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం లబ్ధిదారులకు అండగా నిలిచింది. ప్రభుత్వ పథకాలు అందక, అందుకు అవసరమైన ధృవపత్రాలు ఎలా పొందాలో తెలియక సతమతవుతున్న సామాన్యులకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం భరోసా ఇచ్చింది. అధికార యంత్రాంగం గ్రామాల్లో పర్యటించి సమస్యలపై జల్లెడ పట్టిలా చర్యలు తీసుకుంది. సర్టిఫికెట్లు అవసరమైన వారితో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది దరఖాస్తు చేయించారు. అధికారులు మంజూరు చేసిన ధ్రువ పత్రాలను సైతం నేరుగా ఇంటికే తీసుకెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. అనేక సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలకు సైతం పరిష్కారం చూపించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుని లోపాలున్నట్లు గుర్తిస్తే వాటిని సరిచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

200 గ్రామ సచివాలయాల పరిధిలో..

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో 200 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. గత నెల ఒకటో తేదీ నుంచి రోజుకొక సచివాలయం పరిధిలో శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమం జరిగే వారం రోజుల ముందు నుంచి సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు గ్రామాల్లో పర్యటించి నమోదు చేసిన సమస్యలను శిబిరంలో పరిష్కరించారు. 11 రకాల సర్టిఫికెట్లను పూర్తి ఉచితంగా లబ్ధిదారులకు అందజేశారు. అధికారుల రాకతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సమస్యలున్నవారు అధికారులతో చెప్పి అక్కడికక్కడే పరిష్కరించుకున్నారు.

వేలాది మందికి సర్టిఫికెట్లు అందజేత

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా తుని నియోజకవర్గంలో వేలాది మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. తుని మండలంలో 12,427 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. కోటనందూరు, తొండంగి మండలాల్లోనూ 10 వేల మందికి పైగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కోటనందూరు మండలంలో జారీ చేసిన సర్టిఫికెట్ల వివరాలు

సచివాలయం	సర్వే చేసిన కుటుంబాలు	వచ్చిన దరఖాస్తులు	పరిష్కరించిన దరఖాస్తులు	పరిష్కరించాల్సిన దరఖాస్తులు
అల్లిపూడి-1	792	230	230	0
అల్లిపూడి-2	809	368	358	10
భీమవరపుకోట	651	260	260	0
బిళ్లనందూరు	753	347	340	7
బొద్దవరం	1117	367	363	4
ఇందుగపల్లి	897	210	209	1
జగన్నాథపురం	726	352	341	11
కేఏ మల్లవరం	1143	314	307	7
కేఈ చిన్నయ్యపాలెం	1160	312	304	8
కొత్తకొట్టాం	968	254	254	0
కాకరాపల్లి	701	400	400	0
కోటనందూరు-1	727	277	276	1
కోటనందూరు-2	901	393	390	3
పాతకొట్టాం	1151	424	411	13
సూరపురాజుపేట	1045	286	284	2
మొత్తం	13,541	4,794	4,727	67

బియ్యం కార్డు వచ్చింది



నా భర్త చనిపోయి పదేళ్లు అయ్యింది. అప్పటి నుంచి నా కొడుకు కార్డులోనే ఉన్నాను. మా అబ్బాయికి కారు ఉన్న కారణంగా పింఛను ఆగిపోయింది. పదేళ్లుగా రేషన్ కార్డు కోసం తిరుగుతున్నా అధికారులు ఇవ్వలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకుని జెరాక్స్‌లు తీసుకెళ్లారు. కేవలం నాలుగు రోజుల్లో బియ్యం కార్డు తెచ్చి ఇచ్చారు. జగనన్న సురక్ష చాలా మంచి కార్యక్రమం.

– కనిగిరి రత్నం, కాకరాపల్లి, కోటనందూరు మండలం

పేదలకు మేలు



గతంలో సర్టిఫికెట్ల కోసం ఎలా దరఖాస్తు చేయాలో తెలియక అందరినీ అడగాల్సి వచ్చేది. కుల ధ్రువీకరణ పత్రం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే వాళ్లం. ఇప్పుడు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులే నేరుగా ఇంటికొచ్చి ఏ ఇబ్బంది లేకుండా సర్టిఫికెట్ ఇచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఎంతో మేలు జరిగింది.

– రుత్తల లక్ష్మి, లబ్ధిదారు, కేఈ చిన్నయ్యపాలెం

విశేష స్పందన



జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారు. ఎన్నో ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు సైతం పరిష్కారం చూపించాం. ప్రతి గ్రామంలో సుమారు 400 మందికి సర్టిఫికెట్లు అందజేసాం. సర్టిఫికెట్లు పొంది అర్హత ఉన్నవారితో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయిస్తున్నాం. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు 100 శాతం సద్వినియోగం చేసుకున్నారు.

– సుబ్రహ్మణ్యశర్మ, ఎంపీడీఓ, కోటనందూరు

ప్రతి ఇంటికీ వెళ్లాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టాం. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాం. సచివాలయ సిబ్బంది, వలంటీరు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోగలిగాం. జగనన్న సురక్ష ఒక చారిత్రాత్మక కార్యక్రమం.

– అరుణ్‌కుమార్, ఈఓపీఆర్డీ, కోటనందూరు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- మురారిలో గడపగడపకూ మన ప్రభుత్వం



మురారిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మురారిలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జేసీఎస్ కన్వీనర్ తాళ్లూరి మధు, వైస్ ఎంపీపీ కుంచే రాజా తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి, దోమాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు



తుని రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో పార్శిల్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

తుని: రైళ్ల ద్వారా గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు మూడు విభాగాలకు చెందిన పోలీసులు తుని రైల్వేస్టేషన్‌లో శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ ఎస్సై ఎస్.కె.అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. కాకినాడ నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్ బృందం పార్శిల్స్, ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. మోటారు సైకిల్ పార్కింగ్‌లో ఎక్కువ కాలం నుంచి ఉన్న వాటిని తనిఖీ చేశారు. ఏ పేరు మీద పార్కింగ్‌లో పెట్టారని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి తినుబండారాలు తీసుకోవద్దని సూచించారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ధర్నా



గోకవరంలో తహసీల్దార్ సుగుణకు వినతి పత్రం అందజేస్తున్న వరసాల కుమారి తదితరులు

గోకవరం: మణిపూర్ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరసాల కుమారి అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా శనివారం గోకవరంలో మహిళలు, దళిత నాయకులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక దేవీచౌక్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించి మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వరసాల కుమారి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులను ఉరితీయాలన్నారు. ఘటనకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర సీఎం గద్దె దిగాలని, దీనిపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి తహసీల్దార్ సుగుణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు తుర్రం సత్యవతి, యానిమేటర్ ప్రమీల, సీసీలు నాగమణి, వెంకటలక్ష్మి, రాయుడు సరోజిని, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

జగ్గంపేట: చికిత్స పొందుతూ ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటనలపై కేసులు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని మల్లిసాలకు చెందిన బొజ్జిని వీరబాబు (30) కుటుంబంలో సమస్యల నేపథ్యంలో మనస్థాపం చెంది శుక్రవారం పురుగు మందు తాగాడు. బంధువులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొదుతూ శనివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కాట్రావులపల్లికి చెందిన రాయుడు సత్యనారాయణ (67) కాళ్ల నొప్పులు భరించలేక శుక్రవారం పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం బంధువులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం

కిర్లంపూడి: పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని పశు వైద్యులు వెన్న వినోద్, నయీం సూచించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ముక్కొల్లులో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 27 మంది రైతులకు చెందిన 135 పశువులు, 8 మేకలు, 2 కోళ్లకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని పాడి రైతులకు సూచించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రె నాగేశ్వరరావు, సూరిబాబు, ఎస్.రవికుమార్, అఖీల్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

ప్రత్తిపాడు: స్థానిక హజరత్ మౌలానా హస్సన్ బాబా 21వ గంధోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు హస్సన్ బాబాను దర్శించుకున్నారు. షేక్ బషీర్, రెజీనా దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన గంధోత్సవంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఉప సర్పంచ్ మదినే నూకరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, వార్డు మెంబర్ నూకలమంతి నానీ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎల్‌ఈడీ వెలుగులు చూసి ఓర్వలేక..

- లైట్లకు విద్యుత్ కనెక్షన్ కట్ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు



తునిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వెలుగులు

తుని: స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఎల్ఈడీ లైట్ల వెలుగులను చూసి ఓర్వలేక కొందరు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేశారు. ప్రజాధనంతో వేసిన ఎల్ఈడీలను నాశనం చేయడం వలన ప్రజలకే నష్టం కలుగుతుందన్న జ్ఞానం లేకపోవడం దురదృష్టకరం. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. వీటికి రూ.లక్షల్లో ఖర్చు చేశారు. చీకటి పడితే చాలు పట్టణంలో రంగురంగుల దీపాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఇటువంటి వాటిని నాశనం చేయడంపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా పట్టణ సీఐ గీతా రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. వైర్లు కట్ చేసిన వ్యక్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని ఆయన తెలిపారు.

జాతీయ దినోత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ

కోటనందూరు: ఈ నెలలో జరిగే జాతీయ దినోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య, పంచాయతీ, ఉపాధి, ఇందిరా క్రాంతిపథం సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శర్మ మాట్లాడుతూ ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అందరూ చేనేత దుస్తులు ధరించేలా చూడాలన్నారు. మంచి ప్రతిభ కలిగిన నేతన్నలను సత్కరించాలన్నారు. 10న జరిగే నులుపురుగుల నివారణ దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 9 నుంచి 15 వరకూ నా భూమి–నా దేశం పేరుతో జరిగే వారోత్సవాల్లో భాగంగా ఎంపిక చేసిన చెరువులను అభివృద్ధి చేసి కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించి మండలానికి చేర్చాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, ఎంఈఓ శ్రీనివాస్, పశువైద్యాధికారి రత్నతేజ, ఏపీఎం సూర్యకుమారి, ఏపీఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆజాదీ కా అమృత్ వేడుకగా నిర్వహించాలి

ప్రత్తిపాడు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో అజాద్ కా అమృత్ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ సూచించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ×నాభూమి – నాదేశం×, ×నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం× కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథ్, ఎంఈఓలు వి.రాజబాబు, వై.అచ్చిరావు, ఏపీఎం వై.వెంకట్, ఉపాధి హామీ పథకం జేఈ కమల తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



ఏలేశ్వరంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గోపాలపట్నంలో గర్భిణులకు బాలింతలకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ కటకం శివ

ఏలేశ్వరం: పట్టణంలోని గర్భిణులు, బాలింతలకు శనివారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. 10వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషక పథకంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ చేతులమీదుగా పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో గర్భిణులు, బాలింతలకు శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని అవల్దార్‌పాడు, బుచ్చియ్యపేట, అవులమంద, పాత పెరుమాళ్లపురం, రామారావుపేట, చింతకాయలపేట, తలపంటిపేట తదితర గ్రామాల్లోని గర్భిణులకు, బాలింతలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పోషకాహార కిట్లను అందజేశారు. గోపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ కటకం శివ, ఎంపీటీసీ సభ్యుడు గుని మానికల ఏసుబాబు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో గర్భిణులు, బాలింతలకు శనివారం ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు రాజు, వైఎస్సార్ సీపీ నేతలు కాకి నాని, నాకిరెడ్డి అప్పలనాయుడు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల నిరసన

ప్రత్తిపాడు: ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. రీఅపోర్షన్ ద్వారా సర్దుబాటు జరిగిన ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎస్ సుబ్రహ్మణ్యం, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, గోరస దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



భీమవరపుకోట లైబ్రరీలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ వీరబాబు

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోట గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న స్టడీ సెంటర్‌లో విద్యార్థులకు శనివారం పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. స్థానిక వైబీ పట్నానికి చెందిన బాదం జాన్‌పాల్ ఆర్థిక సహాయంతో రూ.30 వేల విలువ గల పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు సమకూర్చారు. వీటిని శనివారం లైబ్రరీ వ్యవస్థాపకుడు నెమ్మాది రామారావు అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో సర్పంచ్ జిగటాల వీరబాబు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్తపల్లి మాణిక్యలరావు, నాగులాపల్లి అప్పారావు, పృథ్వి, పాస్టర్లు సునీల్, నవీన్, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



సిరిపురంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ చిన్నారావు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన పాదూరి ప్రవీణ్‌కుమార్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలను తహసీల్దార్ చిన్నారావు, సర్పంచ్ పీతల నూకరాజు, వైస్ ఎంపీపీ సాదే లోవరాజు ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, యానాం తదితర ప్రాంతాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాదూరి రత్నకుమారి, పాదూరి రాజ్‌కుమార్, లూథరన్ చర్చి ఫాదర్ రాజ్‌కుమార్, వెలుగూరి హరేరామ్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: స్థానిక నాగరాజు పేట రైల్వే గేటు సమీపంలో గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడని తుని గవర్నమెంట్ పోలీస్ స్టేషన్ ఎస్సై ఎస్‌కె.అబ్దుల్ మారూఫ్ తెలిపారు. శనివారం ఈ ఘటనకు సంబంధించి తుని స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు. నాగరాజు పేట రైల్వే గేటు వద్ద పాయకరావుపేటకు చెందిన ఎస్.శ్రీకాంత్ (31) పట్టాలు దాటుతుండగా విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సంబంధించి మిగిలిన వివరాలు తెలియలేదని, మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై మారూఫ్ వివరించారు.